క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన బుర్ర రాంబాబు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా కొండపర్తి గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు, బీఆర్ఎస్ గ్రామ పార్టీ నాయకులు శనివారం వేర్వేరుగా పరామర్శించి రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆటో యూనియన్ తరఫున రూ.35 వేలు, బీఆర్ఎస్ గ్రామ పార్టీ తరఫున రూ.18వేల ఆర్థికసాయం అందించారు. సాంబరాజు, శంకరయ్య, యాదగిరి, చంద్రమౌళి, ప్రభాకర్, అశోక్, రాజు తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు తల్లి సమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు కోడెపాక స్వరూప సంజీవరావు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సమ్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 25 కేజీల బియ్యాన్ని అందించారు. నాయకులు చంద్రమౌళి, రంజిత్ తదితరులు ఉన్నారు.

ఒకరిపై ఫిర్యాదు

ఆత్మకూరు : మీసేవ కేంద్రంపై అసత్యప్రచారం చేస్తున్నాడని మండల కేంద్రంలోని మీసేవ నిర్వాహకుడు కరివేద మహేందర్‌రెడ్డి ఓ వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కామారం గ్రామానికి చెందిన మూల మధుకర్ సోషల్ మీడియాలో మీసేవ, తనపై అసత్య ప్రచారం, దూషిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్



శాయంపేట : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన సమయంలో డీజే వినియోగాన్ని నిషేధించినట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సై జక్కుల పరమేశ్ తహసీల్దార్ ఎదుట 13 మంది డీజే నిర్వాహకులను బైండోవర్ చేశారు. గణపతి నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిరిచందనకు బంగారు పతకాలు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామానికి చెందిన మోర సిరిచందన బీటెక్ ఈఈఈలో రెండు బంగారు పతకాలు సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ ఈఈఈ విద్యనభ్యసించిన ఆమె యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. ఈ మేరకు శనివారం యూనివర్సిటీలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే 2025లో వీసీ, ప్రొఫెసర్ కుమార్ ములుగురం చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. పలువురు ఆమెను అభినందించారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం నాలుగోరోజు మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు చేపట్టారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా పరిధి ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ వద్ద ఉన్న మైనార్టీ బాలుర గురుకులంలో ఖాళీగా ఉన్న (నాన్ మైనార్టీ కోటా) సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో బీసీ (1), ఎస్సీ (1), ఎస్టీ (1), ఓసీ (2), 6వ తరగతిలో ఎస్టీ (1), ఓసీ (1) సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆదివారం దరఖాస్తు చేసుకోవాలని, మరుసటి రోజు లక్కీడిప్ ద్వారా సీట్లు కేటాయిస్తామని ఆమె వివరించారు.

అసంపూర్తి.. అపరిశుభ్రం



పీచరలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు



వేలేరులో అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

- వెక్కిరిస్తున్న మరుగుదొడ్లు
- కొన్ని గ్రామాల్లో అసంపూర్తి నిర్మాణాలు
- లక్ష్యం చేరని స్వచ్ఛభారత్ మిషన్
- పట్టించుకోని అధికారులు

వేలేరు : ప్రజారోగ్య పరిరక్షణ, పరిసరాల శుభ్రత, ఆరు బయట మలవిసర్జన నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా లక్షలాది రూపాయలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టింది. మండలంలోని పలు గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభించగా కేవలం ఒకటి, రెండు గ్రామ పంచాయతీల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగతా గ్రామాల్లో భూ సమస్య ఎక్కువగా ఉండటంతో మరుగుదొడ్ల నిర్మాణం జన సంచారం లేని ప్రాంతంలో నిర్మించారు. దీంతో వివిధ గ్రామాల ప్రజలు ఇప్పటికీ బహిరంగ ప్రదేశాల్లోనే మలవిసర్జన చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లను ప్రజల అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడలేకపోతున్నాయి. అలాగే వాటి నిర్వహణ పట్టించుకునేవారు లేక నిరుపయోగంగా మారాయి. ఆయా గ్రామాల్లో ఎక్కువ శాతం అప్పటి సర్పంచ్‌లే పనులు చేపట్టారు. బిల్లులు పొందిన వరకు మాత్రమే నిర్మాణ పనులు చేపట్టి తర్వాత బిల్లులు రావడం లేదని పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో నిర్మాణ పనులు అసంపూర్తిగా మారాయి. మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.75 లక్షల నిధులు కేటాయించింది. మండల కేంద్రంలో నిర్మించిన మరుగుదొడ్డి చుట్టూ అపరిశుభ్రంగా ఉండటంతో పాటు పిచ్చి మొక్కలు మొలవడంతో ప్రజలెవరూ వినియోగించడం లేదు. అలాగే పీచర గ్రామంలో నిర్మించిన మరుగుదొడ్లు కూడా అధ్వానంగా మారాయి. మరుగుదొడ్లకు తలుపులు, నీటి సౌకర్యం లేకపోవడంతో వాటిని ఎవరూ వినియోగించడం లేదు. కొన్ని గ్రామాల్లో నిర్మాణ పనులు పూర్తైనా వాటి నిర్వహణను గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తలుపులు, కిటికీలు లేవు



గ్రామంలో నిర్మించిన మరుగుదొడ్డికి తలుపులు, కిటికీలు లేవు. కొంతమంది ఇప్పటికీ మల విసర్జనకు ఆరుబయటకు వెళ్తున్నారు. వర్షాకాలంలో వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- శ్రీనివాస్, పీచర గ్రామస్తుడు

నిర్మాణ పనులు పూర్తి చేస్తాం



మండలంలోని పలు గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలోనే మరుగుదొడ్ల నిర్మాణ పనులపై అధికారులతో చర్చించి పూర్తి చేయించి వాటిని అందుబాటులోకి తీసుకువస్తాం. అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను శుభ్రపరిచేలా చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సరికాదు



దామెర : రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



ఆత్మకూరులో..

దామెర : ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు మండలంలోని ఊరుగొండలో శనివారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. బీహార్ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ చేసిన అనుచిత వాఖ్యలు సరికావని అన్నారు. మోదీని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. మండల ప్రధాన కార్యదర్శులు ముఖేష్, చందర్, నాయకులు మధూకర్, బుచ్చిరెడ్డి, సమ్మిరెడ్డి, పరుశరామ్, రమేశ్, రవీందర్, రాజు, సాంబయ్య, కార్తిక్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మహిళలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో శనివారం బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్ మోర్చా కన్వీనర్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరకాల : బీహార్ యాత్రలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు మండిపడ్డారు. శనివారం పట్టణంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పార్టీ మారే యోచనలో పీఏసీఎస్ డైరెక్టర్..?

- కార్యకర్తలతో సమావేశం

కమలాపూర్ : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు పార్టీ మారే యోచనలో ఉన్నట్లు తెలిసింది. శనివారం కమలాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆయన రహస్యంగా సమావేశం అయ్యినట్లు తెలిసింది. పార్టీ, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కోసం ఎంతో కష్టపడినప్పటికీ పార్టీలో సరైన గుర్తింపు లేదని, ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడలతో విసుగు చెందుతున్నామని పలువురు నాయకులు, కార్యకర్తలు చర్చించినట్లు తెలిసింది. బీఆర్ఎస్‌ను వీడి మరో పార్టీలోకి వెళ్లేందుకు ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. ఈ విషయాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోరిక మేరకు నిర్ణయం తీసుకుంటానని ఆయన చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

నిమజ్జనంలో అపశృతికి తావివ్వొద్దు



దామెర : గిద్దె చెరువును పరిశీలిస్తున్న అధికారులు

- ఆర్డీఓ నారాయణ



ఆత్మకూరు : నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ నారాయణ, ఏసీపీ సతీశ్‌బాబు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువులో సెప్టెంబర్ 5న జరుగనున్న వినాయక నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు జరుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ నారాయణ అధికారులను ఆదేశించారు. కటాక్షపూర్ చెరువు వద్ద నిమజ్జన ప్రదేశాన్ని శనివారం ఆయన ఏసీపీ సతీశ్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. నిమజ్జన సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సంతోశ్, ఐబీ డీఈ వేణుగోపాల్, ఏఈ జ్యోతిరాణి, పంచాయతీ సెక్రెటరీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పరకాల : పరకాల చలివాగు వద్ద గణేశ్ నిమజ్జన ప్రదేశాన్ని మున్సిపల్ కమిషనర్ సుష్మ, తహసీల్దార్, విజయలక్ష్మి, సీఐ క్రాంతికుమార్, విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు.

శాయంపేట : గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబర్ 5వ తేదిన జరుగనున్న గణపతి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎస్సై పరమేశ్ అన్నారు. మండల కేంద్రంలో నిమజ్జనం చేసే ప్రదేశాలైన దేవుని చెరువు, ప్రగతి సింగారం వంతెనను తహసీల్దార్ సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్‌తో కలిసి శనివారం పరిశీలించారు.

దామెర : దామెర మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నిమజ్జన ప్రదేశాలను ఎస్సై కొంక అశోక్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు వీలుగా చదునుచేయాలని అన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

హసన్‌పర్తి: 65వ డివిజన్ చింతగట్టులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతగట్టు ఏరియాను శనివారం సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయని, దోమల బెడదతో స్థానికులు జ్వరాల బారిన పడుతున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు, నాయకులు పుల్లా అశోక్, లలిత, సారయ్య, పావని, పూలమ్మ, అనిత పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఖిలా వరంగల్: అర్హులైన నిరుపేదలకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం నాయకుడు ధర్మారపు సాంబమూర్తి కోరారు. 43వ డివిజన్ తిమ్మాపురం, జక్కలొద్ది గ్రామాల్లో పార్టీ రంగశాయిపేట ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఉదయశ్రీ, ఇసంపల్లి మంజుల, స్వాతి, రజియా, షమీనా, నలిగంటి రజిని, తోట మల్లయ్య, తోట రాజు, బందెల కృష్ణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

లా కళాశాలలో అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కాజీపేట: కాజీపేట మహాత్మా జ్యోతిబాపూలే మహిళా గురుకుల న్యాయ కళాశాలలో లా అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎంలో కనీసం 55 శాతం మార్కులు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులని పేర్కొన్నారు. లా లో పీహెచ్‌డీ, నెట్, సెట్‌తో పాటు పూర్వ అనుభవం ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 5వ తేదీలోపు ఆఫ్‌లైన్‌లో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులు వినియోగించుకోవాలని కోరారు.

ఔషధ మొక్కలపై అవగాహన అవసరం

హన్మకొండ: ఔషధ మొక్కలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అనిశెట్టి శ్రీధర్, కాకతీయ విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర రిటైర్డ్ ప్రొఫెసర్ రాంరెడ్డి అన్నారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఔషధ మొక్కల ప్రదర్శన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 గ్రూపుల విద్యార్థులు 175 జాతుల ఔషధ మొక్కలను ప్రదర్శించారు. డాక్టర్ అనిశెట్టి శ్రీధర్, రాంరెడ్డితో పాటు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ డీఎస్ఓ శ్రీనివాసస్వామి న్యాయ నిర్ణేతలుగా వ్యవహించి గ్రూపుల వారీగా ఔషధ మొక్కలు పరిశీలించారు. కార్యక్రమంలో వాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ సీహెచ్.దేవేందర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ వాహిని దేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పండి



వేలేరు : అఖిలపక్ష నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న



కమలాపూర్ : మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు



ఎల్కతుర్తిలో..

- రాజకీయ పార్టీల నాయకులతో అధికారుల సమావేశం

వేలేరు / ఎల్కతుర్తి / కమలాపూర్ / దామెర/ శాయంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామ పంచాయతీల్లో ప్రచురించిన ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఎంపికపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలుపాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అధికారులు సూచించారు. వేలేరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో ఎంపీడీఓలు వీరేశం, విజయ్‌కుమార్, కమలాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బాబు, శాయంపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, దామెర మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కల్పన అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా వార్డులు, బూత్‌ల వారిగా పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించామని చెప్పారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఎంపికపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశాల్లో అధికారులు, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం,కాంగ్రెస్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'స్థానికం'లో సీపీఎం ఒంటరి పోరు

- జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఐనవోలు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఆ పార్టీ మండలస్థాయి విస్తృతస్థాయి సమావేశం నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతోన్మాద రాజకీయాలకు సీపీఎం వ్యతిరేకమని, అలాంటి రాజకీయాలు చేసే పార్టీలపై ప్రజా పోరాటాలు చేస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించి ప్రశ్నించే గొంతుకు బలం చేకూర్చాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి, కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమణకు గురయ్యాయని అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నాయకులు నాగరాజు, ఉప్పలయ్య, రామ్‌కుమార్, మహేందర్, గుంశావలి, కవిత, గోపాల్, సుధాకర్, నర్సయ్య, యాకయ్య, మణెమ్మ, పోచమ్మ, సరోజన, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- ఎస్సై రాజు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై రాజు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ములకనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై రాజు సూచించారు. శనివారం ముల్కనూరు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సమాజంలో మంచి వ్యక్తులుగా మారాలని, గొడవలు, అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలన్నారు. అక్రమాలు, నేరాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ల ప్రస్తుత జీవన విధానం గూర్చి అడిగి తెలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక నిఘా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

'మా ఓటు నాగయ్యపల్లిలోనే ఉంచాలి'



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఓటర్లు

ఆత్మకూరు : ఓటరు సవరణలో భాగంగా మండలంలోని నాగయ్యపల్లి గ్రామాన్ని గీసుకొండ మండలం బొడ్డుచింతలపల్లిలో చేర్చారని, తమ ఓట్లను నాగయ్యపల్లిలోనే ఉంచాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఓటర్లు మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన 81ఓట్లను ఇతర గ్రామానికి మార్పు చేశారని అన్నారు. అధికారులు వెంటనే తమ గ్రామ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. దీంతో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి స్పందించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు వారు పేర్కొన్నారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లిలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఎల్కతుర్తి : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమదేవరపల్లి మండలంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద శనివారం మిత్ర షాప్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ములకనూరు ఎస్సై రాజు పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. అన్నదానంతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. వినాయక నిమజ్జన సమయంలో ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

పరకాలలో..

పరకాల : అలాగే పరకాల పట్టణంలోని మమతానగర్ గణేశ్ మండపం నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇడ్లీ పాత్ర అందజేత

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీకి చెందిన సమ్మెట మహేందర్, మార్నేని వేంకటేశ్వర్‌రావు శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలకు రూ. 5వేల విలువచేసే ఇడ్లీ పాత్రను అందించారు. ఎస్ఓ కోటగిరి సునీత దాతలకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థినుల సౌకర్యార్థం దాతలు చేసిన సాయానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థినులు చదువుపై దృష్టిసారించాలని కోరారు.

శ్వేతార్క ఆలయంలో ప్రత్యేక పూజలు

కాజీపేట: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శనివారం సూర్య నమస్కార పూజలు, కేరళ పద్ధతిలో తాంత్రిక పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ అర్చన, అభిషేకాలు చేశారు